క్లుప్తంగా

నేటి నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష' ఇంటింటి సర్వే

ఇబ్రహీంపట్నం: జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వే మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణనాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వేలో ఆరోగ్య, పంచాయతీ సిబ్బంది, వలంటీర్లు ప్రతి ఇంటిలో దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారిని గుర్తించి యాప్‌లో పొందుపరుస్తారు. ఆ కుటుంబానికి టోకెన్ ఇస్తారని ఈనెల 30 నుంచి నిర్వహించే ప్రత్యేక ఆరోగ్య వైద్య శిబిరాల్లో పరీక్షలు చేయించుకోవచ్చు.

పర్యావరణాన్ని కాపాడుదాం

మైలవరం: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా శాఖ చైర్మన్ డాక్టర్ సమరం తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యూత్ రెడ్‌క్రాస్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సంయుక్తంగా కళాశాల సమీపంలో 500 మొక్కలు నాటారు. జి. కొండూరు రెడ్‌క్రాస్ చైర్మన్ కొల్లు నాగేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి, మైలవరం సొసైటీ చైర్మన్ డాక్టర్ శివ హరిప్రసాద్, నేషనల్ హైవే అథారిటీ అధికారులు భాస్కర్, నాగయ్య, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓ.. అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఎన్టీఆర్‌జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని బుధవారం అర్ధరాత్రి పలు పీహెచ్‌సీలను ఆకస్మిక తనిఖీలు చేసి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. అందులో భాగంగా రాత్రి 11.20 గంటలకు జి.కొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, 12.04 గంటలకు కొండపల్లి, అర్ధ రాత్రి 12.22గంటలకు ఇబ్రహీంపట్నం ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఊటుకూరు(గంపలగూడెం): అత్తమామలు, భార్య, ఆమె ప్రియుడు నుంచి ఎదురైన అవమానం భరించలేక గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మృతి చెందిన సంఘటన ఊటుకూరులో గురువారం చోటు చేసుకుంది. పెళ్లి జరిగిన పదిరోజుల్లోనే చోటు చేసుకున్న ఘటన బంధువులను తీవ్రంగా కలచివేసింది. ఎస్ఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన జక్కుల కనకారావు రెండో కుమారుడు వంశీ(23) ఘటనలో మృతి చెందాడు. హైదరాబాద్ హెటోరో డ్రగ్స్ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న వంశీకి ఈనెల 3వ తేదీ తెలంగాణ రాష్ట్రం బోనకల్లు మండలం రావినూతలకు చెందిన అఖిలతో వివాహమైంది. ఈ నెల 7న అఖిలను తీసుకొని వంశీ అత్తింటికి బయలుదేరాడు. ఆ సమయంలో అఖిల వేరే వ్యక్తితో ఫోన్లో మాట్లాడుతుంది. ఎవరితో మాట్లాడుతున్నావు అని నిలదీయగా తన ప్రియుడు శ్రీకాంత్‌తో అని సమాధానం ఇచ్చింది. వెంటనే ఆమెను తీసుకొని వంశీ రావినూతలకు వెళ్లాడు. జరిగిన తంతు వివరించగా అక్కడ కూడా అత్తమామలు జొన్నలగడ్డ రవి, కోటేశ్వరిలు అఖిలను సమర్థిస్తూ వంశీని అవమానించారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన ప్రియుడు శ్రీకాంత్ కూడా వంశీపై ఇష్టానుసారంగా మాట్లాడాడు. వంశీని తండ్రి కనకారావు బైక్‌పై ఎక్కించుకొని ఊటుకూరు బయలుదేరారు. మార్గమధ్యంలో వంశీ దిగిపోయాడు. తర్వాత ఇంటికి వచ్చిన వంశీని కుటుంబీకులు ప్రశ్నించారు. తనకు జరిగిన అవమానాన్ని వివరించి, గడ్డిమందు తీసుకున్నానని చెప్పాడు. వెంటనే వంశీకి కుటుంబీకులు మధిర ప్రైవేటు ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించిన తర్వాత మెరుగైన వైద్యానికి విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి ప్రభుత్వ ఆసుపత్రికి మార్చారు. పరిస్థితి విషమించడంతో వంశీ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుని తండ్రి కనకారావు ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గడప గడపలో అపూర్వ స్పందన

- ప్రజామద్దతుతో 30వేల గడపలు పూర్తి
- ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్

రెడ్డిగూడెం: గడప గడపలో వైఎస్సార్ సీపీకి అపూర్వ వస్తోందని, నియోజకవర్గంలో 72 రోజులు పర్యటించి 30వేల గడపల మైలురాయిని పూర్తి చేశామని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్ తెలిపారు. మండలంలోని నాగులూరు గ్రామంలో 25వ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన గడప గడపకూ వెళ్లి సంక్షేమ పథకాలు వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. ఆయన మాట్లాడుతూ డిసెంబర్ నాటికి నియోజకవర్గంలో అన్ని సచివాలయాల పరిదిలో పూర్తి చేయాలనే లక్ష్యంతో వెళ్తున్నానని, సీఎం జగనన్న స్ఫూర్తితో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నానన్నారు. నాడు-నేడు కింద పాఠశాలల అభివృద్ధి, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ సెంటర్లు, సచివాలయాల అభివృద్ధి, కమ్యూనిటీ భవనాలు, ఆసుపత్రుల అధునికీకరణ, ఇళ్ల స్థలాలు, పక్కా గృహాల నిర్మాణం, సిమెంట్‌రోడ్లు, డ్రెయినేజీలు, సొసైటీ భవనాలు, గోదాముల నిర్మాణాలు, బీటీరోడ్లు, ఇలా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో



నాగులూరులో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

జెడ్పీటీసీ పాలంకి విజయభాస్కరరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ బలగాని తిరుపతిరావు, మండల సచివాలయాల కన్వీనర్ ఉయ్యూరు భరత్‌కుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ చాట్ల రాబర్టు, రెడ్డిగూడెం మండల వ్యవసాయమండల కమిటీ చైర్మన్ బత్తుల వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చట్ట ప్రకారమే చంద్రబాబు అరెస్టు

రెడ్డిగూడెం: చట్టప్రకారమే చంద్రబాబునాయుడిని అరెస్ట్ చేశారని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. రెడ్డిగూడెం మండలం నాగులూరు గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మీడియాలో మాట్లాడుతూ దేశంలో ఎంతోమంది ముఖ్య నేతలపై కేసులు నమోదు చేశారని, ఆయా కేసులను న్యాయపరంగా వారు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. చంద్రబాబు చట్టానికి అతీతుడు కాదన్నారు. చేతనైతే నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలన్నారు. గతంలో ప్రస్తుత ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై కూడా కేసులు పెట్టారన్నారు. వాటిని ఆయన చట్టప్రకారం ఎదుర్కొన్నారన్నారు. అప్పుడు జగన్‌మోహన్‌రెడ్డిపై కేసు పెడితే సక్రమం, ఇప్పుడు చంద్రబాబుపై కేసులు పెడితే అక్రమమా..?అని ప్రశ్నించారు. కుట్రపూరిత వ్యవహారాలు మానుకోవాలని ప్రతిపక్షాలకు హితవు పలికారు. సమావేశంలో జెడ్పీటీసీ పాలంకి విజయభాస్కరరెడ్డి, సర్పంచ్ ఎం. నాగబాబు, మండల పార్టీ కన్వీనర్ బలగాని తిరుపతిరావు, కలకొండ రామారావు తదితరులున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



తిరువూరులో కొత్త పెన్షన్ల పంపిణీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రక్షణనిధి

తిరువూరు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని తిరువూరు ఎమ్మెల్యే కె.రక్షణనిధి అన్నారు. గురువారం తిరువూరు మండల పరిషత్ కార్యాలయంలో కొత్తగా మంజూరైన 450 వైఎస్సార్ పెన్షన్ కానుక నగదును లబ్ధిదారులకు అందజేశారు. ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, ఎంపీపీ గద్దల భారతి, వైస్ ఎంపీపీలు రాధాకృష్ణ, వెంకటనరసమ్మ, జెడ్పీటీసీ యరమల రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- మూలపాడు(ఇబ్రహీంపట్నం): మూలపాడులో కొత్తగా 52 మందికి మంజూరైన పింఛన్ల పంపిణీలో జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, సర్పంచి చింతల భూలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు గొట్టిముక్కల రాధ, జి.పోతురాజు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నంలో సచివాలయాల కన్వీనర్ లంకే అంకమోహనరావు అధ్యక్షతన జరిగిన పంపిణీలో కౌన్సిలర్ నల్లమోతు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.
- పెనుగొలను(గంపలగూడెం): పెనుగొలను సచివాలయంలో కొత్తగా మంజూరైన 78 పెన్షన్లను సర్పంచ్ లలిత తదితరులు అందజేశారు.
- విస్సన్నపేట: స్థానిక మార్కెట్‌యార్డు గోడౌన్ వద్ద మండలంలో నూతనంగా మంజూరైన 380 పింఛన్ల పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్ వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి, సర్పంచ్ సాధుపాటి నాగమల్లీశ్వరి, కేడీసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

జాతీయ సమైక్యతకు హిందీ దోహదం

గానుగపాడు(తిరువూరు): జాతీయ సమైక్యతకు, సమగ్రతకు హిందీ భాష దోహదం చేస్తుందని దక్షిణభారత హిందీ ప్రచార సభ ప్రచారక్ రేపాక రఘునందన్ అన్నారు. మండలంలోని గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం హిందీ దివస్ నిర్వహించారు. రఘునందన్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులు తదితరులు సత్కరించారు.
తునికిపాడు(గంపలగూడెం): తునికిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ దినోత్సవం జరిగింది.

నాగేంద్రమ్మకు ఎమ్మెల్యేల నివాళి

అమ్మిరెడ్డిగూడెం(గంపలగూడెం): అమ్మిరెడ్డిగూడెం గ్రామంలో ఇటీవల మృతి చెందిన మందపాటి నాగేంద్రమ్మకు తిరువూరు, జగ్గయ్యపేట ఎమ్మెల్యేలు కొక్కిలిగడ్డ రక్షణనిధి, సామినేని ఉదయభాను గురువారం నివాళి అర్పించారు. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు మందపాటి ఉమామహేశ్వరరెడ్డి మాతృమూర్తి నాగేంద్రమ్మ దశదిన కార్యక్రమానికి హాజరై నివాళులర్పించారు.

విద్యార్థులకు అభినందన

తిరువూరు: మండల స్థాయి పాఠశాల క్రీడల్లో తమ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరచి వివిధ విభాగాల్లో గెలుపొందినట్లు కోకిలంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుప్తా తెలిపారు. తిరువూరులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో జరిగిన టెన్నికాయిట్, బాల్ బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ తదితర క్రీడల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందించారు.

స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవాలి

మైలవరం: స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవాలని కిసాన్ మోర్చా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు రేగళ్ల రఘునాధరెడ్డి తెలిపారు. మైలవరంలో జాతీయత-స్వాతంత్ర్య సమరయోధులకు గుర్తుగా దేశ రాజధాని ఢిల్లీలో 18 ఎకరాలు విస్తీర్ణంలో పవిత్ర అమృత వాటిక నిర్మాణం చేపట్టారని, దీనిలో భాగంగా దేశంలోని అన్ని గ్రామాల మట్టిని కలిపి స్మృతి వనంగా మారుస్తున్నారన్నారు. మైలవరంలో గురువారం మట్టిని బీజేపీ నాయకులు సేకరించారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ఇతర నేతలు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): తల్లిపాలతో బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ కేతనకొండ సెక్టార్ సూపర్ వైజర్ ఎస్కే జాహీదాబేగం అన్నారు. తల్లిపాల మాసోత్సవాల్లో భాగంగా కేతనకొండలో, గంపలగూడెంలో 'పోషణ్ మా' గురువారం జరిగింది.

పర్యావరణ హితంగా 'చవితి' చేయాలి

తిరువూరు/ముసునూరు: వినాయక చవితి పర్వదిన సందర్భంగా మట్టి గణపతి ప్రతిమలనే వినియోగించాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్ గంగాధర్ అన్నారు. గురువారం స్థానిక సిద్ధార్థ స్కూలు ఆవరణలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పర్యావరణ హితంగా పండుగలు అనే అంశంపై కార్యక్రమం జరిగింది. ముసునూరులో పలుచోట్ల కళాజాతలు నిర్వహించారు.

సమన్వయంతో పని చేయండి

నూజివీడు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సమన్వయంతో విజయవంతం చేయాలని డెప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో దయాల ఆశ అన్నారు. ఈ నెల 15నుంచి నిర్వహించాల్సిన జగనన్న సురక్షపై పట్టణంలోని ఆశావర్కర్లకు, ఏఎన్ఎంలకు గురువారం మున్సిపల్ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సౌమ్య, తదితరులు పాల్గొన్నారు.

రెజ్లింగ్ పోటీలకు మైలవరం విద్యార్థులు

మైలవరం: రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు కనకదుర్గ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 14 బాలబాలికల విభాగంలో బి.మౌనిక 41కిలోలు కేటగిరిలో, ఎం.జయరత్న 68కిలో కేటగిరిలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరు ఈ నెల 21 నుంచి నున్నలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లోపాల్గొంటారన్నారు. పీఈటీ వెంకయ్యను విజేతలను ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణిస్వామి, జెడ్పీటీసీ సభ్యుడు ఎస్. తిరుపతిరావు, తదితరులు అభినందించారు.

క్రీడాపోటీలకు 117 మంది విద్యార్థులు

ముసునూరు: జిల్లా క్రీడా పోటీల్లో నియోజకవర్గానికి కీర్తి కిరీటాన్ని అందించాలని ఎంపీపీ ఆర్.కృష్ణకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు డా.వరికూటి ప్రతాప్ ఆకాంక్షించారు. గురువారం ముసునూరు జెడ్పీ హైస్కూల్లో ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీలను వారు ప్రారంభించారు. క్రీడా పోటీలకు నియోజకవర్గంలోని 250 మంది బాలురు హాజరు కాగా 117 మంది జిల్లా జట్లకు ఎంపికైనట్లు నూజివీడు డీవైఈఓ సేవియా నాయక్ తెలిపారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

గంపలగూడెం: శ్రావణ మాసంలో చివరి రోజు అమావాస్య సందర్భంగా గురువారం మండలంలో గ్రామదేవత ముత్యాలమ్మకు భక్తులు విశేష పూజలు నిర్వహించారు.